క్లుప్తంగా

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పరకాల: బైక్ అదుపుతప్పిన సంఘటనలో తీవ్ర గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొగుళ్లపల్లి మండలానికి చెందిన ఎలకంటి బుచ్చిరాములు (55) తాపీ మేస్త్రీ పనిచేస్తు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 5న అంకుషాపూర్ గ్రామానికి చెందిన ఇటుకాల సతీష్‌కు సంబంధిత బంధువులు ఇంటి గోడ నిర్మాణం కోసం సీతారాంపూర్‌కు వెళ్లి తిరుగు ప్రయాణంలో సతీష్‌తో పాటు బుచ్చిరాములు ద్విచక్రవాహనంపై బయలు దేరారు. పరకాల మండలం లక్ష్మీపురం వద్ద గేదేలు అడ్డువచ్చి పడిపోయారు. ఈ ఘటనలో బుచ్చిరాములు తలకు బలమైన గాయం కావడంతో వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ బుచ్చి రాములు శుక్రవారం రాత్రి మృతిచెందాడు. బైక్‌ను నిర్లక్ష్యంగా నడిపి తన భర్త చావుకు కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య ఎలకంటి లక్ష్మీ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటరత్నం వెల్లడించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



ఐనవోలు: మండలంలోని పంథిని గ్రామ శివారు పౌల్ట్రీఫారంలో నిల్వ చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు శనివారం పట్టుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో కొంతమంది పీడీఎస్ బియ్యాన్ని సేకరించి అక్రమంగా టాటా ట్రాలీ వాహనంలో పౌల్ట్రీఫాంకు తరలించి విక్రయిస్తున్నారనే సమాచారంతో సోదాలు చేసినట్లు పోలీసులు తెలిపారు. అనుమతి లేకుండా తరలిస్తున్న సుమారు 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

నేడు మోడల్ ఆడిషన్స్

నయీంనగర్: ఫ్యాషన్ షోలో పాల్గొనడానికి మోడల్స్ ఆడిషన్స్ కార్యక్రమాన్ని హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని రోస్ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు గౌస్‌పాషా తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశం ఆయన మాట్లాడుతూ ఆసక్తి ఉన్నవారు 75697 01494 నంబర్‌లో సంప్రదించి పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

10న రుమటాలజీ వైద్య శిబిరం

హన్మకొండ: ఈనెల 10వ తేదీన హనుమకొండ కాకాజీకాలనీలోని శ్రీఏషియన్ రుమటాలజీ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు ఎం.మధుకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీనియర్ రుమటాలజిస్ట్ డాక్టర్ వీ.సునీల్ వైద్య పరీక్షలు చేసి తగు జాగ్రత్తలు, సూచనలు చేస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 99665 54455, 78935 88057 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

ఫిబ్రవరిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన

కరీమాబాద్: వచ్చే ఏడాది ఫిబ్రవరిలో కరీమాబాద్‌లో బొడ్రాయి పున: ప్రతిష్ఠాపన వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కరీమాబాద్‌లో కొమ్మిని రాజేందర్ అధ్యక్షతన అర్చకులు, కార్పొరేటర్లు, కాలనీవాసులతో శనివారం నిర్వహించిన సమావేశంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన తేదీలను ఖరారు చేశారు. 2024 ఫిబ్రవరి 11, 12, 13, 14వ తేదీల్లో బొడ్రాయి వేడుకలు నిర్వహించనున్నట్లు ఏకగ్రీవంగా తీర్మానించారు.

వీరన్నకు డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని జియాలజీ విభాగం పరిశోధకుడు బోడ వీరన్నకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. పెట్రోల్ జీ, జియో కెమిస్ట్రీ అండ్ పెట్రో జీన్సిస్ ఆఫ్ ది సివమాలై ఆల్కెలైన్ ప్లూటాన్ కోయంబత్తూరు డిస్ట్రిక్స్ తమిళనాడు స్టేట్, సౌథర్న్ ఇండియన్ పెనిన్సులార్ ప్రావిస్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి బోడ వీరన్నకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. విభాగం ప్రొఫెసర్ మల్లికార్జున్ రెడ్డి పర్యవేక్షణలో వీరన్న తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. డాక్టరేట్ రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు వీరన్న తెలిపారు.

సమాచార సేకరణలో ఆర్టీఐదే ముఖ్య భూమిక

కాజీపేట అర్బన్: సమాచార సేకరణలో ఆర్టీఐ (రైట్ టు ఇన్ఫర్మేషన్) ముఖ్య భూమిక పోషిస్తోందని ఆర్టీఐ క్యాంపెయినర్ రాకేష్ దుబ్బుడు తెలిపారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా నిట్ వరంగల్‌లోని బోస్ హాల్‌లో సమాచార హక్కు చట్టంపై శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులను ఎల్లప్పుడు గమనించే మూడో కన్ను సమాచార హక్కు చట్టం అని అన్నారు. 135 దేశాల్లో ఆర్టీఐ అమలులో ఉండగా భారతదేశం 62వ స్థానంలో ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో నిట్ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ సీఎస్ఆర్కే ప్రసాద్, సీహెచ్. సాయి ప్రసాద్, డీన్లు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌గా గెలిచినందుకు తగిన శాస్తి

- రావాల్సిన బిల్లులు చెల్లించండి
- సమావేశంలో సర్పంచ్‌ల ఆగ్రహం



కమలాపూర్ : బిల్లులు చెల్లించాలని అధికారులను నిలదీస్తున్న సర్పంచ్‌లు



శాయంపేట : సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి

కమలాపూర్: 'ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన ఊరు, మనబడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను పూర్తి చేసేందుకు అప్పులు చేశాం. బిల్లుల కోసం నెలల తరబడి ఎదురుచూస్తున్నా చెల్లించడం లేదు. అధికారుల నిర్లక్ష్యమా, లేదా ఇతర సమస్య ఏదైనా ఉందా అర్థం కావడం లేదు. అప్పులు తెచ్చిన చోట వడ్డీలు పెరుగుతున్నాయి. సర్పంచ్‌గా గెలిచినందుకు మాకు తగిన శాస్తినే జరుగుతోంది' అని మండలంలోని పలువురు సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ తడక రాణి అధ్యక్షతన శనివారం గరంగరంగా జరిగింది. మన ఊరు-మన బడి పనులు చేస్తే ఇప్పటి వరకు బిల్లులు రావడం లేదని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు, శంభునిపల్లి సర్పంచ్ పెండ్యాల రవీందర్‌రెడ్డితో పాటు పలువురు సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. సైడ్ డ్రెయిన్లు కట్టిన బిల్లులు ఎప్పుడు వస్తాయని, అసలు వస్తాయా? రావా అని ఎంపీటీసీ మాట్ల వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో చర్చించిన సమస్యలకే దిక్కు లేక పోతే మిగతా సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని అధికారులను నిలదీశారు. ఇన్ని రోజులు ఏఈ లేక ఇబ్బందులు తలెత్తాయని, ఇప్పుడు ఏఈని నియమించారని, ఈ విషయంలో కలెక్టర్‌ను కలిసి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటానని ఎంపీడీఓ పల్లవి సర్పంచులకు వివరించారు. మద్రిపల్లిలో రేషన్‌షాపు ఏర్పాటు చేయాలని, ఇళ్లపై నుంచి విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని, వాటిని తొలగించి మిడిల్ పోల్స్ వేయాలని సర్పంచ్ రజిత కోరారు. పైప్‌లైన్ లీకేజీలను వెంటనే అరికట్టి ఉప్పల్‌కు మిషన్ భగీరథ నీళ్ల సరఫరా చేయాలని ఎంపీటీసీలు సంపత్‌రావు, అరుణ సంబంధిత అధికారులను కోరారు. గ్రామ పంచాయతీలకు కరెంట్ చార్జీలు ఎక్కువగా వస్తున్నాయని, మీటర్లు మార్చాలని పలువురు సభ్యులు కోరారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ పేరాల సంపత్‌రావు, ఎంపీడీఓ పల్లవి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

శాయంపేట : గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తిరుపతిరెడ్డి అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్చలు జరుపడమే కాకుండా వాటిని పరిష్కరించాలని అన్నారు. సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమం దిశగా పాలన కొనసాగిస్తున్నారని, క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు. పంచాయతీరాజ్ చట్టం బలోపేతం కావడంతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. జీపీ భవన నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 24 వతేదీ నుంచి అన్ని పాఠశాలల్లో అల్పాహారం అందించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, చక్కగా చదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్ హైమావతి, వైస్ చైర్మన్ మారపల్లి నందం, ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ

ఐనవోలు: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ మార్నేని మధుమతి అన్నారు. మండలంలోని ఒంటిమామిడిపల్లిలో మండల పరిషత్ నిధులతో హనుమాన్ ఆలయం నుంచి నిర్మించనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో గ్రామాల్లో మట్టిరోడ్లు మాత్రమే ఉండేవన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో గ్రామాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నట్లు చెప్పారు. పల్లె ప్రగతి ద్వారా అనేక మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. తెలంగాణ సాధన ఫలితంగా ప్రజలకు అనేక సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని రానున్న ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌ను మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కడుదూరి రాజు, ఆత్మక మిటీ డైరెక్టర్ పొన్నాల రాజు, సొసైటీ డైరెక్టర్ రాజారపు కుమార్, మాజీ సర్పంచ్ ఆడెపు దయాకర్, చెంచు ప్రతాప్, పెండ్లి తిరుపతి, గోనె కుమారస్వామి, కొట్టం రమేష్, పెంతల లింగారెడ్డి, రాజారపు రాజు, పెండ్లి ఆగారెడ్డి, తిరుపతి, ఆడెపు విక్రమ్, కార్యదర్శి వేణు పాల్గొన్నారు.

రైతులను అభినందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

శాయంపేట : దేశానికి అన్నం పెడుతున్న రైతులను వివిధ కంపెనీలు అభినందించాల్సిన అవసరం ఉందని ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రాజెక్టు అసోసియేట్ మేనేజర్ అక్కల రమేష్ అన్నారు. మండలంలోని కాట్రపల్లిలో శనివారం ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో ప్రపంచ పత్తి దినోత్సవంను నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. పత్తి పంటపై ఆధారపడేటువంటి వివిధ కంపెనీలు జిన్నింగ్‌మిల్, మార్కెటింగ్ స్పిన్నర్లు, వ్యవసాయ కూలీలు, పత్తి రైతులపై ఆధారపడుతున్నారని వారి సేవలను గుర్తించాలని అన్నారు. పత్తితోనే దుస్తులు తయారవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల్ రైతు ఉత్పత్తి దారుల సంఘం క్షేత్ర సిబ్బంది రవిచందర్, గౌస్, తిరుపతి, సునీల్, భానుమతి, ప్రశాంత్, కల్పన, మనోహర్, రైతులు ప్రసాద్, మహేందర్, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాం



ఆర్థిక సాయం అందజేస్తున్న తిరుపతిరావు

దామెర: బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు మన్నెం రవీందర్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన రవీందర్‌రెడ్డి భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రవీందర్‌రెడ్డి పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నాగరాజు, ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్, నియోజకవర్గ కోకన్వీనర్ రతన్‌కుమార్, వివిధ మోర్చల అధ్యక్షులు బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి. బిల్లా రమణారెడ్డి, సమ్మిరెడ్డి, చంద్రకిరణ్ ఉన్నారు. అదే విధంగా రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, రమణారెడ్డి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

ఆర్థిక సాయం అందజేత..

కమలాపూర్: మండలంలోని ఉప్పల్‌లో ఇటీవల మృతి చెందిన మృతుల కుటుంబాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాయినేని తిరుపతిరావు శనివారం పరామర్శించారు. రామానుజం కుటుంబంతో పాటు మరో కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. సర్పంచ్ దేవేందర్‌రావు, ఉపసర్పంచ్ ఓదెలు, మాజీ జెడ్పీటీసీ నవీన్‌కుమార్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు ముజీబ్ హుస్సేన్, వార్డు సభ్యులు శ్రీధర్‌రావు, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు రాజు, నాయకులు మొండయ్య, రాంచందర్, పైడి, తిరుపతి, రాజు, రవి, రమేష్, శ్రీనివాసరావు, రాజమౌళి, స్వామి, సంపత్, రఘు, సంపత్, జితేందర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

'కానిస్టేబుళ్లకు సన్మానం'



కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న నాయకులు

దామెర : మండలంలోని తక్కళ్లపహాడ్‌కు చెందిన దాడి అఖిల్, దాడి సూర్యప్రసాద్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన సందర్భంగా వారిని బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రమేశ్ శనివారం శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాడి భిక్షపతి, శరబంధం, కేతన బోయిన నాగరాజు, రాజు, పవన్ పాల్గొన్నారు.

విద్యార్థులు సక్రమంగా హాజరయ్యేలా చూడాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సీఎంఓ రాధ, జీసీడీఓ సునీత

ఐనవోలు: ప్రతీ విద్యార్థి పాఠశాలకు క్రమంతప్పకుండా హాజరయ్యేలా ఉపాధ్యాయులు చర్య తీసుకోవాలని జిల్లా కమ్యూనిటీ మొబిలైజ్ ఆఫీసర్ (సీఎంఓ)రాధ అన్నారు. మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆమె శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల పఠన సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలకు సక్రమంగా హాజరుకాని విద్యార్థుల తల్లిదండ్రులతో నేరుగా మాట్లాడి ప్రతిరోజు పాఠశాలకు పంపించాలని సూచించారు. అదే విధంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి కూరల నాణ్యత మెరుగ్గా ఉండాలని ఆదేశించారు. మెనూ ప్రకారమే వంటలు చేయాలని సూచించారు. తొలిమెట్టు ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సునీత, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, మధుకర్, బీమళ్ల సారయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ఎల్కతుర్తి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లోని ప్రధాన రహదారిపై ఆశ కార్యకర్తలు శనివారం ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. కనీస వేతనం రూ. 18వేలు చెల్లించాలన్నారు. వీరికి పలు రాజకీయ నాయకులు సంఘీబావం తెలిపారు.

హామీలను అమలు చేయాలి

ఎంజీఎం: రాష్ట్రంలో ఎన్‌హెచ్ఎం స్కీమ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వం రాత పూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎన్‌హెచ్ఎం ఎంప్లాయీస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. హైదరాబాద్ కోటిలో డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ కార్యాలయం ఎదుట ఎన్‌హెచ్ఎం ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం మహా ధర్నా నిర్వహించారు. ధర్నాకు వెళ్తున్న సందర్భంగా హనుమకొండ జిల్లా డీఎంహెచ్ఓ కార్యాలయంలో డాక్టర్ సాంబశివరావును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి యూనియన్ పిలుపు మేరకు వెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు సూర సంపత్‌కుమార్, మురళి, పృథ్వీలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలి




వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

పరకాల: చారిత్రక ప్రాంతమే కాకుండా మున్సిపాలిటీ, రెవెన్యూ డివిజన్ కేంద్రంగా కొనసాగుతున్న పరకాలలో సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలని పరకాల బార్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని అసోసియేషన్ అధ్యక్షుడు వి. చంద్రమౌళి ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే ధర్మారెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి సబ్‌కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పున్నం రాజిరెడ్డి, ఒంటేరు రాజమౌళి, మేరుగు శ్రీనివాస్, ఎం.శ్రావణ్ కుమార్, పి.వేణు, డి.రమేష్, ఎ.రవికుమార్, జి.రాహుల్, విక్రమ్, ఎం.సురేష్, జి.ప్రకాశ్, ఎల్.శంకర్, ఏజీపీ భద్రయ్య, సుధాకర్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కమలాపూర్: మండలంలోని ఉప్పల్‌లో ఎస్డీఎఫ్ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు శనివారం శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించారు. మొండెద్దుల తిరుపతి ఇంటి నుంచి సారయ్య ఇంటి వరకు రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు, మిల్కూరి రాధమ్మ ఇంటి నుంచి ఎలిగేటి రామస్వామి ఇంటి వరకు రూ.5 లక్షలతో నిర్మించనున్న సైడ్‌డ్రైన్, పీహెచ్‌సీ చుట్టూ రూ.5 లక్షలతో ఏర్పాటు చేయనున్న ఫెన్సింగ్, గేట్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సర్పంచ్ దేవేందర్‌రావు, ఉపసర్పంచ్ ఓదెలు, మాజీ జెడ్పీటీసీ నవీన్‌కుమార్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు ముజీబ్ హుస్సేన్, వార్డు సభ్యులు శ్రీధర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాయినేని తిరుపతిరావు, గ్రామ అధ్యక్షుడు జక్కుల రాజు, నాయకులు మొండయ్య, రాంచందర్, పైడి, తిరుపతి, రాజు పాల్గొన్నారు.

కొండెంగల హల్‌చల్



ఆత్మకూరు: మండల కేంద్రంలో కొండెంగలు హల్‌చల్ చేస్తున్నాయి. సమీపంలోని ఓ ప్రైవేట్ స్కూల్ విద్యార్థిని శుక్రవారం గాయపర్చాయి. అలాగే పోచమ్మ సెంటర్ వద్ద నాలుగు కొండెంగలు సంచరించడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. నాలుగు నెలలుగా కొండెంగలు పలువురిని గాయపరుస్తున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు మొద్దునిద్ర వీడడం లేదని ప్రజలు ఆగ్రహిస్తున్నారు. పోలీస్, ఫారెస్టు అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం

- ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ధర్మసాగర్: రాష్ట్రంలోని నిరుపేదల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. మండలంలోని కేశవనగర్‌లో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ. 20 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనం, రూ. 12.60 లక్షలతో నిర్మించిన స్మశాన వాటికను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని అన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో పట్టణాలు, పల్లెల నుదిటిరాతలు మారుతున్నాయని అన్నారు. పల్లెప్రగతి కార్యక్రమంతో ప్రతీ ఊరు అభివృద్ధి చెందిందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మునిగాల శోభ, ఎంపీడీఓ జవహర్‌రెడ్డి, సర్పంచ్‌లు కర్ర సోమిరెడ్డి, మునిగెల రాజు, వైస్ ఎంపీపీ బండారి రవీందర్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

వెంచర్ నిర్మాణ పనుల నిలిపివేత



ట్రాక్టర్‌లో పిల్లర్ రాడ్లను జీపీకి తరలిస్తున్న సిబ్బంది

కమలాపూర్: మండల కేంద్రం నుంచి దేశరాజుపల్లికి వెళ్లే మార్గంలో నూతనంగా నిర్మిస్తున్న వెంచర్ నిర్మాణ పనులను శనివారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఈఓ రమణారెడ్డి నిలిపివేశారు. వెంచర్‌కు గ్రామ పంచాయతీ, 'కుడా' నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే వెంచర్ నిర్మాణ పనులు చేస్తున్నారని తెలిపారు. గ్రామంలోని వరద కాల్వను ఆక్రమించుకుని పిల్లర్లు నిర్మిస్తున్నారని గ్రామస్తులు, రైతులు, వార్డు సభ్యుల నుంచి ఈఓకు ఫిర్యాదులు అందాయి. దీంతో స్పందించిన ఈఓ రమణారెడ్డి శనివారం గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి వెంచర్ నిర్మిస్తున్న ప్రాంతాన్ని సందర్శించి సంబంధిత పత్రాలను పరిశీలించారు. ఇప్పటి వరకు వెంచర్ నిర్మాణానికి అనుమతులు తీసుకోలేదని, వెంటనే పనులు నిలిపివేయాలని ఆదేశించారు. అక్రమ వెంచర్‌లకు చోటులేదన్నారు. వరద కాల్వను ఆక్రమించి నిర్మిస్తున్న పిల్లర్ రాడ్లను గ్రామ పంచాయతీ కార్యాలయానికి తరలించారు. వార్డు సభ్యులు ఎండపెల్లి మల్లారెడ్డి, వెంగళ విజయ్, పుల్ల అయిలయ్య, నాయకులు మురళి, స్థానిక రైతులు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పు చేయను.. తలవంచను

- ఎమ్మెల్సీ కడియం శ్రీహరి



మాట్లాడుతున్న కడియం శ్రీహరి

ధర్మసాగర్: జీవితంలో తాను తప్పు చేయనని, తలవంచనని, ప్రజల కోసం నిజాయితీగా పని చేస్తానని స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని పెద్దపెండ్యాల, నారాయణగిరి, ముప్పారం, సోమదేవరపల్లి, దేవునూర్, రాపాకపల్లి గ్రామాల్లో శనివారం ఆ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. దేశంలోని 28 రాష్ట్రాలు తెలంగాణ వైపు చూస్తున్నాయని, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఆచ్చర్యపోతున్నారని అన్నారు. పల్లెలు అభివృద్ధి చెందాలన్నా, ప్రజలు సంతోషంగా ఉండాలన్నా పంటలు సమృద్ధిగా పండాలని, రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వ్యవసాయంను పండుగలా మారుస్తున్నారని అన్నారు. ఒకప్పుడు అన్నమో రామచంద్రాఅన్న తెలంగాణ ఇవ్వాల దేశానికే అన్నం పెట్టే రాష్ట్రంగా ఎదిగిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలు కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో అమలు కావడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ చెబుతున్న మాయమాటలను ప్రజలు నమ్మొద్దన్నారు. తాను 30 ఏళ్లుగా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో ఈ స్థాయిలో ఉన్నానని, మరోసారి అవకాశం ఇస్తే రెండు సంవత్సరాల్లో నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని అన్నారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా కడియం కండువా కప్పి ఆహ్వానించారు. డీసీసీబీ డైరెక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ శ్రీలత, సర్పంచ్‌లు అన్నమ్మ, సమ్మక్క, మంజుల, కవిత, వినోద, ఎంపీటీసీ రమాదేవి, నాగయ్య, నాయకులు నాగరాజు, యాదగిరి, రాంరెడ్డి, కడియం యువసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్యనారాయణకు ఒక చాన్స్ ఇవ్వాలి



కొప్పులలో ప్రచారం చేస్తున్న నాయకులు

శాయంపేట : రానున్న ఎన్నికల్లో భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావుకు ఒక చాన్స్ ఇచ్చి అసెంబ్లీకి పంపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. మండలంలోని కొప్పుల, వసంతాపూర్ గ్రామాల్లో శనివారం 6 గ్యారంటీ కార్డు స్కీంలపై ఇంటింటికీ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న సత్యనారాయణరావును ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికల్లో పలుమార్లు ఓటమిపాలైనా ప్రజల మధ్యనే ఉంటూ సమస్యలపై పోరాటం చేస్తున్నారన్నారు. కార్యకర్తలు ఇంటింటికెళ్లి గ్యారెంటి కార్డులను చేరవేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏరుకొండ శంకర్, వంగాల తిరుపతిరెడ్డి, చాడ రాంరెడ్డి, ప్రవీణ్, సతీష్, భాస్కర్, దామోదర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సఖి సేవలు సద్వినియోగం చేసుకోవాలి



వాల్‌పోసర్టర్లు ఆవిష్కరిస్తున్న వినీల, తదితరులు

దామెర: బాధిత మహిళలు, యువతులు, విద్యార్థినులకు సఖికేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ వినీల సూచించారు. మండలంలోని దుర్గంపేట్‌లో సఖివన్‌స్టాప్ సేవలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, ఆడపిల్ల పుడుతుందనే అనుమానంతో గర్భవిచ్ఛిత్తి సమస్యలు ఎదుర్కొంటున్న వారికి సఖీ అండగా నిలుస్తుందన్నారు. సఖి కేంద్రానికి వచ్చిన మహిళలకు తాత్కాలిక వసతి, వైద్యం, న్యాయ, కౌన్సిలింగ్, పోలీస్ సేవలు అందిస్తామని పేర్కొన్నారు. బాధిత మహిళలు సాయం కోసం 0870-2452112 లేదా టోల్ ఫ్రీ నెంబర్ 181కు ఫోన్ చేసి సాయం పొందాలని సూచించారు. అనంతరం ప్రత్యేకంగా రూపొందించిన వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నేడు డబుల్‌బెడ్రూం ఇళ్ల ప్రారంభోత్సవం

ఆత్మకూరు: మండలంలోని గుడెప్పాడ్‌లో నూతనంగా నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదివారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.